నిలిచిన 'పీఎం స్వనిధి'



- వీధి వ్యాపారులకు అందని రుణాలు
- నాలుగున్నర నెలలుగా పనిచేయని సైట్
- ఇబ్బందులు పడుతున్న వీధి వ్యాపారులు

పీఎం స్వనిధి రుణాల మంజూరు వివరాలు...

మున్సిపాలిటీ	వీధి వ్యాపారులు	రూ. 10 వేలు	రూ. 20 వేలు	రూ. 50 వేలు
ధర్మపురి	982	734	455	146
మెట్‌పల్లి	3,713	2,791	1,124	401
రాయికల్	934	799	395	165
కోరుట	4,188	3,321	1,683	476
జగిత్యాల	6,825	4,782	2,351	682
మొత్తం	16,632	12,427	6,008	1,870

జగిత్యాల, మే 18 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లో చిరు, వీధి వ్యాపారులకు అందించే పీఎం స్వనిధి (ఆత్మనిర్భర్ నిధి) రుణాల ప్రక్రియ నిలిచిపోయింది. నాలుగున్నర నెలలుగా సంబంధిత సైట్ పనిచేయడం లేదు. దీంతో స్వనిధి రుణాలు అందడం లేదు. దీంతో తొలి, మలి రుణాలకోసం ఎదురుచూస్తున్న వీధి వ్యాపారులు నిరాశ కు గురవుతున్నారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మ పురి మున్సిపాలిటీల్లో చిరు వ్యాపారాలు చేస్తూ జీవనం సాగించే వీధి వ్యాపారులకు ఆర్థికంగా చేయూతనందించేందుకు కేంద్ర ప్రభుత్వం స్వల్ప కాలిక రుణాలను మంజూరు చేస్తుంది.

2020 సంవత్సరంలో కరోనా లాక్ డౌన్ నుంచి ఆత్మ నిర్భర్ నిధి పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద వీధి వ్యాపారులకు మొదటి విడతలో రూ.10 వేల రుణం అందజేశారు. ఈ మొత్తాన్ని బ్యాంకుల ద్వారా నేరుగా లబ్ధి దారుల ఖాతాల్లో జమ చేశారు. చిన్న వ్యాపారులకు ప్రభుత్వం అంద జేసే ఈ మొత్తం వారి జీవనోపాధికి ఎంతగానో ఉపయోగపడేది.

● రుణం కోసం ఎదురుచూపులు..

ఐదు సంవత్సరాల క్రితం ప్రతీ వీధి వ్యాపారికి రూ.10 వేలు వారి ఖాతాల్లో జమ చేయగా ఈ మొత్తాన్ని ఏడాది లోపు వడ్డీతో సహా బ్యాంకులకు చెల్లించిన వారికి మళ్లీ రుణం తీసుకోవడానికి వీలు కలిగేది. రెండో విడతలో రూ.20 వేలు అందించగా, మూడో విడతలో దానిని రూ.50వేలకు పెంచారు. రుణం మొత్తం పెరుగుతూ ఉండడం, వ్యాపారా భివృద్ధికి తోడుగా నిలవడంతో లబ్ధిదారులు రుణం తీసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. బ్యాంకర్లు సైతం ఈ రుణాలు సక్రమంగా చెల్లించిన వారికి అందించేందుకు ముందుకొచ్చారు. కానీ నాలుగున్నర నెలలుగా రుణాలు అందించడం లేదు. దీంతో సంబంధిత వీధి వ్యాపారులు ఆందోళనకు గురవుతున్నారు.

● రుణాన్ని రూ.లక్షకు పెంచితే...

ఆత్మనిర్భర్ నిధి పథకం కింద రుణాలు మంజూరు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని విధించింది. అయితే ఇటీవల కొత్త పథకం అమలు చేసేందుకు వీలుగా సాంకేతిక పరంగా ఆప్షన్ ఇవ్వక పోవడంతో పాత వారితో పాటు కొత్త వారికి కూడా రుణాలు అందించేందుకు తాత్కలి కంగా బ్రేక్ పడినట్లు తెలుస్తోంది. కొత్త పథకం అమలు చేసేంత వరకు పీఎం స్వనిధి పథకం నిలిచిపోయినట్లుగానే భావిస్తున్నారు. అయితే వీధి వ్యాపారులకు రూ.50వేల వరకు ఇస్తున్న రుణాన్ని రూ.లక్షకు పెంచాలని పలువురు కోరుతున్నారు. దీంతో ఆర్థిక అవసరాలు తీరడంతో పాటు ఉపాధి పెరిగి జీవన ప్రమాణాలు మరింత పెరుగుతాయని వారు అంటున్నారు.

● జిల్లాలో 16,981 మంది వీధి వ్యాపారులు

జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల పరిధిలో 16,981 మంది వీధి వ్యాపారులున్నారు. ఇందులో రాయికల్‌లో 929 మంది, ధర్మపురిలో 1,020 మంది, జగిత్యాలలో 6,929 మంది, మెట్‌పల్లిలో 3,770 మంది, కోరుట్లలో 4,334 మంది వీధి వ్యాపారులున్నట్లు మెప్మా కార్యాలయాల రికార్డులు వెల్లడిస్తున్నాయి.

సాంకేతిక సమస్యలతో జాప్యం



పీఎం స్వనిధి ప్రక్రియకు సంబంధించిన వెబ్‌సైట్ కొన్ని రోజులుగా పనిచేయడం లేదు. దీంతో వీధి వ్యాపారులకు రుణాల మంజూరు సాధ్యం కావడం లేదు. సైట్ పునరుద్ధరణ జరగాల్సి ఉంది. సాంకేతిక సమస్యల కారణంగా జాప్యం ఏర్పడింది. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లాం. సాంకేతిక సమస్యలు సరిచేయగానే పునరుద్ధరణ జరుగుతుంది.

-దుర్గపు శ్రీనివాస్ గౌడ్, మెప్మా జిల్లా పరిపాలన అధికారి

నేటి నుంచి 'టీబీ ముక్త్ భారత్'

జగిత్యాల అర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం నుంచి టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. వంద రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో జిల్లాలో క్షయ వ్యాధికి గుయ్యే అవకాశం ఉన్న వారిని గుర్తించే కార్యచరణ సిద్ధం చేశామని అన్నారు. జిల్లాలోని 397 గ్రామాల్లో ప్రతి ఒక్క గ్రామంలో క్షయ వ్యాధి అనుమానితులను గుర్తించి వారికి అక్కడే పరీక్షలు నిర్వహించి ఎక్స్‌రే తీయించి ఫలితాలను వెంటనే తెలుపుతామన్నారు. 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, పొగ తాగేవారు, ఆల్కహాల్ తీసుకునే వారు, పొగాకు నమిలే వారు డయాబెటిస్ ఉన్న వారిని పరీక్షిస్తామని అన్నారు. టీబీ వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందజేస్తామని ఆయన తెలిపారు.

●కొడిమ్యాల : టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్య క్రమం కింద సోమవారం నుంచి వంద రోజుల కార్యచరణ కార్యక్రమం జిల్లాలో నిర్వహిస్తామని జిల్లా ఉప వైద్య అధికారి ఎన్.శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలోని 397 గ్రామాల్లో క్షయ అనుమానితులను అక్కడే పరీక్షించి ఫలితాలను వెంటనే తెలుపుతామన్నారు. ఒకవేళ నెగటివ్ వచ్చినట్లయితే టీబీ ప్రివెంటివ్ థెరపీ ద్వారా చికిత్స అందిస్తామన్నారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె వాయిదా

● ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు

కోరుట్ల, మే 18 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జూలై 9వ తేదీకి వాయిదా పడినట్లు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, బీడీ ఫెడరేషన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి సుతారి రాములు తెలిపారు. ఆదివారం పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో కార్మిక సంఘ నేతలతో సమావేశం ఏర్పాటు చేసిన సుతారి రాములు కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు హాల్గాంలతో కలిసి మాట్లాడారు. సార్వత్రిక సమ్మె అనివార్య కారణాలతో జూలై 9కి వాయిదా పడినట్లు ఆయన తెలిపారు. కాశ్మీర్ రాష్ట్రంలో జరిగిన ఉగ్రవాదుల దాడులను పరిగణనలోకి తీసుకొని సార్వత్రిక సమ్మెను వాయిదా వేసినట్లు తెలిపారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెను అన్ని కార్మిక సంఘాలు మద్దతు పలికి విజయవంతం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయుసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయు సంఘ నాయకులు రామిల్ల రాంబాబు, దేశవేని నర్సయ్య, గంగాధర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రకృతి వ్యవసాయం

● గ్రామవికాస్ ప్రాంత సంయోజకులు జిన్నా సత్యనారాయణరెడ్డి

జగిత్యాల రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని గ్రామ వికాస్ ప్రాంత సంయోజకులు జిన్నా సత్యనారాయణరెడ్డి అన్నారు. మాధవసేవ పరిషత్ ఆధ్వర్యంలో జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి సురభి గోశాలలో ఆదివారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దేశసౌభాగ్యం, సామాన్య ప్రజల ఆరోగ్యం, ఆర్థిక వికాసం, పర్యావరణ పరిరక్షణ కోసం గో ఆధారిత వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కోరారు. ఈకార్యక్రమంలో గ్రామభారతి ప్రాంత అధ్యక్షురాలు సూర్యకళ, దక్షిణభారత ప్రకృత వ్యవసాయ రైతు శిక్షకులు రవీంద్రనాయ్, మరళీధర గోశాల నిర్వాహకులు చెన్నమనేని పద్మ, సురభి గోశాల అధ్యక్షుడు డాక్టర్ తురగరాజిరెడ్డి, బండారి కమలాకర్‌రావు, మాధవసేవ పరిషత్ కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, అశోక్‌రావు, మంచాల జగన్, రామారావు పాల్గొన్నారు.

అర్ధాంతరంగా నిలిచిన బ్రిడ్జి నిర్మాణం

- ఎనిమిదేళ్లుగా ముందుకు సాగని పనులు
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు



అసంపూర్తిగా నిలిచిన బ్రిడ్జి నిర్మాణం

పెగడపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండల కేంద్రంలోని యాపల్ చెరువు మత్తడి దిగువన బ్రిడ్జి నిర్మాణం అర్ధాంతరంగా నిలిచి రాకపోకలకు గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఏడుమోటలపల్లి తండా, రాంబద్రునిపల్లి, ఎల్లాపూర్, ల్యాగలమర్రి గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే అదనంగా మూడు కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. ఎనిమిదేళ్ల క్రితం ప్రభుత్వ చీఫ్ విప్‌గా ఉన్న కొప్పుల ఈశ్వర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేయించారు. బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు టెండర్ ప్రక్రియ పూర్తయి అప్పడు విప్‌గా కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ దాదాపు రెండేండ్లకు పైగా పనులు చేసి నిధులు సరిపోవడం లేదని బ్రిడ్జి నిర్మాణం పనులను అర్ధాంతరంగా వదిలేసి వెళ్లిపోయాడు. ఇప్పటికైనా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవ తీసుకుని అర్ధాంతరంగా నిలిచిన బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేయించాలని నాలుగు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి..



బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి. ఎనిమిదేళ్లుగా పనులు నిలిచిపోయినా పట్టించుకున్న నాథుడే లేడు. బ్రిడ్జి ప్రారంభం కాకుండానే శిథిలావస్థకు చేరిన దానిలాగా కనిపిస్తోంది. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేసి రాకపోకలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలి.

-బక్క నాయక్ , ఏడుమోటలపల్లి

ప్రయాణ బాధలు తొలగించాలి..



అర్ధాంతరంగా నిలిచిన బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టి ఐదు గ్రామాల ప్రజల ప్రయాణ బాధలు తొలగించాలి. వర్షాలు కురిసేలోగా పనులు చేపట్టి నిర్మాణం పూర్తి చేసేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలి.

-రాజేశ్వర్ రావు, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు

ఘనంగా నల్లపోచమ్మ బోనాలు



నల్లపోచమ్మ ఆలయానికి బోనాలతో వెళ్తున్న మహిళలు

మెట్‌పల్లి రూరల్, మే, 18 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి మండలంలోని వెల్లుల్ల గ్రామంలోని నల్లపోచమ్మ బోనాల పండుగను గ్రామస్థులు ఘనంగా నిర్వహిం చారు. ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వచ్చే వర్షకాలంలో పాడి పంటలు సమృద్ధిగా పండి ప్రజలం దరిని చల్లగా చూడు తల్లి అంటూ నాయకులు, మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి కమిటీ నాయకులు, మహిళలు బోనాలతో నేత్తిన ఎత్తుకొని డబ్బు చప్పులతో ఊరేగింపుగా ఆలయం కు చేరుకున్నారు. అనంతరం అమ్మ వారికి ప్రత్యేక పూజ లు చేసి బోనాలు, నైవేద్యాలు గొర్రెపిల్లలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ నాయకులు, సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

జయంత్యుత్సవాలకు

కొండగట్టు ముస్తాబు



- నేడు అంకురార్పణ
- రేపటి నుంచి మూడు రోజుల పాటు వేడుకలు

5

నూతన రంగులతో అంజన్న ఆలయం, యాగశాల

రాళ్లవాగు కుడి కాలువకు

మహర్దశ కలిగేనా?



- నేడు ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల ఇరిగేషన్ ఈఎన్‌సీలతో ప్రభుత్వ విప్ సమీక్ష

4

రాళ్లవాగు కుడి కాలువకు పడిన గండి

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



ప్రత్యేక పూజలో పాల్గొన్న విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి జాతర, కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. ఉదయం నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. పండితులు శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. చుట్టుపక్కన గ్రామాలైన సిరికొండ, దుంపెట, భూషణరావుపేట, చింతకుంట గ్రామాల నుంచి భక్తజనం తరలివచ్చింది. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజల్లో పాల్గొనగా అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్ర మంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

● జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత



మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల అర్బన్, మే (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిందని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత ఆరోపించారు. తన దగ్గర రూపాయి లేదన్న సీఎం రేవంత్‌రెడ్డికి అందాల పోటీలకు వచ్చిన సుందరీమణులకు ఒక్కొక్కరికి 30 తులాల బంగారం ఎలా ఇస్తారని ఆమె ప్రశ్నించారు. ఆదివారం జిల్లా కేంద్రంలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ ఆడ బిడ్డల పెళ్లికి తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. అకాల వర్షానికి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీల అమలును తుంగలో తొక్కారని దావ వసంత విమర్శించారు.

సూర్యదేవుడికి పల్లకీ సేవ

జగిత్యాల అగ్రికల్చర్, మే 18(ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని శ్రీ సూర్యధన్వంతరీ దేవాలయంలో సూర్య దేవుడి దినమైన ఆదివారంను పురస్కరించుకొని స్వామి వారికి పల్లకి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ వడ్లగట్ల రాజన్న, ఆర్గనైజింగ్ సెక్రెటరీ వొద్నాల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు నాయిని విద్యాసాగర్‌రావు, ప్రధాన కార్యదర్శి వడ్లగట్ల శంకర్, ధర్మకర్తలు భారతాల రాజసాగర్, దేవదాస్, రాజేష్, అర్చకులు చిలకముక్కు నాగరాజు తదితరులున్నారు.

'మహానాడును విజయవంతం చేయాలి'

మల్లాపూర్, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లాలో మూడు రోజుల పాటు నిర్వహించే మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుట్ల నియోజక వర్గం తెలుగుదేశం ఇన్‌చార్జి మానుక ప్రవీణ్‌కుమార్ కోరారు. ఆదివారం మల్లాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి తెలుగుదేశం సభ్యత్వం కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌ను ఐటీ రంగంలో అభివృద్ధి చేసి ప్రపంచంలో ఐదో స్థానంలో నిలిపిన ఘనత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుదేనని కొనియాడారు. రాష్ట్రంలో మొదటిసారి ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు, బిజినెస్ స్కూల్స్, మెడికల్ ల్యాబ్స్, జన్మభూమి వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఈనెల 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు సాగే మహానాడు కార్యక్రమంలో నియోజక వర్గంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండి సాదుల్లా, దామెర లక్ష్మారెడ్డి, దామెర రాజలింగం, మునుగంటి నర్సయ్య, ఏనుగు చినరాజారెడ్డి, మునుగు గంగారెడ్డి, కటకం శంకర్, నలువాల నగేష్, మామిడిపల్లి నర్సయ్య, చిప్ప రాజశేఖర్, కటకం మహదేశ్, గంగులు, తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ సభ్యుడికి సన్మానం

మెట్‌పల్లిటౌన్, మే 18(ఆంధ్రజ్యోతి): ఐఎంఏ జాతీయ వైద్య విధాన రాజ్యాంగ సవరణ కమిటీ మెంబర్‌గా ఎన్నికైన డాక్టర్ గంగా సాగర్‌ను ఆదివారం కోరుట్ల ఎమ్మెల్యే కల్వ కుంట్ల సంజయ్ సన్మానించారు. మెట్‌పల్లి బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో గంగాసాగర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయ కులు తేజ, ఆకుల ప్రవీణ్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



తిరుపతిరెడ్డి(ఫైల్)

సైదాపూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయికల్ గ్రామానికి చెందిన రావుల తిరుపతిరెడ్డి(38) అనేరైతు ఆర్థిక ఇబ్బందులతో ఆదివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకొన్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలప్రకారం.. శనివారం రాత్రి తిరుపతిరెడ్డి భార్య పిల్లలు, ఇంటి బయట పడుకున్నారు. తిరుపతిరెడ్డి మాత్రం ఇంట్లోని బెడ్‌రూంలో కూలరు వేసుకొని పడుకున్నాడు. ఉదయం అతని భార్య కవిత లేచి తలుపు దగ్గరకు వెళ్లి ఎంత పిలిచినా లేవలేదు. ఫోన్ చేసిన ఎత్తలేదు. దీంతో తలుపులను బలంగా తన్నడంతో తలుపులు తెరుచుకున్నాయి. లోపలికి వెళ్లి చూసేసరికి తిరుపతిరెడ్డి చీరతో దూలానికి ఉరి వేసుకొని చనిపోయి ఉన్నాడని వారు తెలిపారు. తమకు 2.20ఎకరాల భూమి ఉన్నదని, వ్యవసాయం చేసుకొని జీవిస్తుంటామని తిరుపతి రెడ్డి భార్య కవిత పేర్కొంది. వ్యవసాయం కోసం సుమారు 10లక్షల వరకు అప్పు అయిందని అన్నారు. దీనికి తోడు ఇద్దరు ఆడ పిల్లలున్నారని అప్పులు ఎలా తీర్చాలనే మనస్థాపంతోనే తన భర్త మృతి చెందాడని కవిత తెలిపారు. ఈ మేరకు మృతుడి భార్య కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జీ ఎస్సై భార్గవ్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత బలవన్మరణం

ఎల్లారెడ్డిపేట, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఓవైపు భర్త అనారోగ్యం.. మరోవైపు ఆర్థికఇబ్బందులు తట్టుకోలేక మనస్థాపం చెందిన వివాహిత నరెడ్ల స్వప్న(32) ఉరి వేసుకుని బలవన్మరణానికి ఒడిగట్టింది. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని స్వప్న భర్త సత్యం ద్విచక్రవాహన మెకానిక్‌గా పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. యేడాది కిందట అనారోగ్యానికి గురయ్యాడు. దాంతో కుటుంబ పోషణ భారం స్వప్నపై పడింది. భార్యభర్తల నడుమ మనస్పార్థాలు నెలకొనడంతో స్వప్న పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. రెండు నెలల కిందట గ్రామానికి చేరుకున్న ఆమె భర్త అనారోగ్యంతో బాధ పడుతుండడం.. పిల్లల పోషణకు ఆర్థిక ఇబ్బందులతో సతమతమైంది. మనస్థాపం చెందిన స్వప్న గదిలోని వెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన ఆమె కూతురు సాత్విక భయంతో కేకలు వేస్తూ చుట్టుపక్కల వారికి చెప్పింది. అక్కడకు చేరుకున్న చుట్టుపక్కల వారు మృతదేహాన్ని కిందకు దింపారు. ప్రొబేషనరీ ఎస్ఐ లక్ష్మణ్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని లక్ష్మణ్ వివరించారు. మృతురాలికి భర్త సత్యం, కొడుకు సన్నిహిత్, కూతురు సాత్విక ఉన్నారు.

ఉరి వేసుకుని వృద్ధుడి ఆత్మహత్య



ముత్తయ్య(ఫైల్)

చందుర్తి, మే 18 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యం, ఒంటరితనం ఆరోగ్య సమస్యలతో పాటు కంటిచూపు మందగించడంతో ఓ వృద్ధుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొండ ముత్తయ్య (65) ఒంటరితనం, అనారోగ్య సమస్యలతో పాటు కంటి చూపు మందగించడంతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య పది సంవత్సరాల క్రితం మృతిచెందింది. రెండో కుమారుడు మధు డ్రగ్స్‌కు అలవాటు పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెద్ద కుమారుడు స్వామి సౌదీ వెళ్లాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజయ్య తెలిపారు.

ధాన్యం కుప్పలను ఢీకొని ఒకరి మృతి



రంజిత్‌కిరణ్ (ఫైల్)

తిమ్మాపూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపైన రైతులు ఆరబోసిన దాన్యం కుప్పలను ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతి చెందిన సంఘటన మండలంలోని మల్లాపూర్‌లో చోటుచేసుకుంది. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ రూరల్ మండలం మొగ్ధుంపూర్ గ్రామానికి చెందిన నేరెళ్ల రంజిత్‌కిరణ్(32) తన స్నేహితుడు సాజిద్‌తో కలిసి మల్లాపూర్‌లోని స్నేహితుడిని కలిసేందుకు శనివారం సాయంత్రం బైక్‌పై వచ్చారు. తిరిగి అర్ధరాత్రి కరీంనగర్‌కు వెళుతుండగా మల్లాపూర్ గ్రామానికి చెందిన మామిడిసతీష్ అనేరైతు రోడ్డుపై పోసిన ధాన్యం కుప్ప కనిపించక దానిని ఢీకొట్టారు. దీంతో బైక్ అదుపుతప్పి కిందపడడంతో రంజిత్‌కిరణ్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సాజిద్‌కు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కరీంనగర్ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి భార్య రితిక ఫిర్యాదు మేరకు రైతు మామిడి సతీష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని సీఐ సదన్ కుమార్ సందర్శించి రైతులు రోడ్డుపై ధాన్యం ఆరపోయవద్దని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

సుల్తానాబాద్, మే 18: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుగ్లాంపల్లి గ్రామంవద్ద రాజీవ్ రహదారిపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. సుగ్లాంపల్లి వద్ద నుంచి రోడ్డు పక్క నుంచి నడుచుకుంటూ వస్తుండగా పెద్దపల్లి నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ట్రాలీవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. అయితే ప్రమాదానికి కారణమైన ట్రాలీ ఆపకుండా వెళ్తుండగా సుగ్లాంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ ఈర్ల వెంకటేశ్వర్లు ద్విచక్ర వాహనంపై వెంబడించి ట్రాలీని పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకున్నారు. మృతుడు మతిస్థిమితంలేని వ్యక్తిగా భావిస్తున్నారు. ప్రమాదానికి కారకుడైన ట్రాలీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ట్రాలీని కూడా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

యువజన సంఘాలకు ఆదరణ కరువు

- కార్యక్రమాల్లో భాగస్వాములను చేయని నెహ్రూ యువ కేంద్రం
- జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులను సాధించిన వారినీ పట్టించుకోని వైనం



గణేశ్‌నగర్, మే 18 (ఆంధ్రజ్యోతి): గతంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యువజన సంఘాలు చురుకుగా పని చేసేవి. నెహ్రూ యువ కేంద్రం (ఎన్‌వైకే) ఆధ్వర్యంలో సంవత్సరం పొడువునా కార్య క్రమాలు నిర్వహించేవారు. రాను రాను కార్యక్రమా లు తగ్గిపోయాయి. ఒకప్పుడు సందడిగా ఉండే ఎన్‌వైకే ఇప్పుడు నిర్మానుష్యంగా మారింది.

● నామమాత్రంగా కార్యక్రమాలు

గ్రామీణ ప్రాంతంలోని యువతీ, యువకులను, యువజన సంఘాల సభ్యులను జాతి నిర్మాణంలో పాల్గొనేలా అవకాశాలను కల్పించేందుకు నెహ్రూ యువ కేంద్రాలను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేశారు. కరీంనగర్‌లో 1988లో నెహ్రూ యువ కేంద్రం ఏర్పాటు చేశారు. ఘన చరిత్ర ఉన్న కరీంనగర్ నెహ్రూ యువ కేంద్రం దశాబ్ద కాలంగా నామమాత్రంగా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. గ్రామీణ ప్రాంత యువజన సంఘాలను సమన్వయం పరచడం, యువజన సాధికారతపై దృష్టి కేంద్రీకరించడం లేదు. గతంలో యువజన ఉత్సవాలు ఘనంగా నిర్వహించేవారు. ఉమ్మడి జిల్లా నుంచి పలువురు ఉత్సవాల్లో పాల్గొని జిల్లాస్థాయి, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో అవార్డులు అందుకున్నారు. ప్రస్తుతం ఆ కార్యక్రమాలేవీ నిర్వహించడం లేదు. సంవత్సరంలో ఒకటి, రెండు కార్యక్రమాలను నామమాత్రంగా నిర్వహిస్తున్నారు. వాటిలోనూ యువజన కేంద్రాలకు భాగస్వామ్యం కల్పించడం లేదు.

● కోర్సుల ఊసే లేదు...

నెహ్రూ యువ కేంద్రంలో కుట్టు మిషన్, టైలరింగ్, బ్యూటిషన్ కోర్సులు నిర్వహించేవారు. ప్రస్తుతం అవి మచ్చుకైనాఆ లేదు. కలెక్టర్ ఈ విషయంపై దృష్టి సారించాలని యువజన సంఘాల నేతలు కోరుతున్నారు. యువజన సంఘాల సారథ్యంలో క్రీడా పోటీలను బ్లాక్, జిల్లా స్థాయిలో పోటీలను గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించేవారు. ప్రస్తుతం అవి కనుమరుగయ్యాయి.

● నాయకులకు ప్రాధాన్యం కరువు

సామాజిక సేవే పరమావధిగా తమ జీవితాలను పణంగా పెట్టి జిల్లాలోని పలువురు యువజన సంఘాల నాయకులు నెహ్రూ యువ కేంద్రానికి అనుబంధంగా పనిచేశారు. యువజన చైతన్య సదస్సులు, శ్రమదానం, మొక్కలు నాటడం వంటి స్వచ్ఛంద సేవ, స్వయంసేవా లాంటి కార్యక్రమాలతో పాటు యువజన సంఘ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించారు. జిల్లాకు రాష్ట్ర, జాతీయ స్థాయిలలో సామాజిక సేవా విభాగంలో ఉత్తమ యువజన అవార్డులు తెచ్చిపెట్టారు. ఇప్పుడు తమను పట్టించుకునే వారేలేరనివారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● వార్షిక ప్రణాళిక మాటే లేదు

నెహ్రూ యువ కేంద్రంలో వార్షిక ప్రణాళిక ఊసే ఎత్తడం లేదు. యువతకు ఇచ్చే శిక్షణలు, చేపట్టే కార్య క్రమాలు, వచ్చిన బడ్జెట్ ఎంత తదితర వివరాలను కేంద్రంలోని నోటీస్ బోర్డ్‌పై ఉంచాలి. ఈ నిబంధనను పట్టించుకున్న వారే లేరు. నెహ్రూ యువ కేంద్రం ద్వారా గ్రామీణ యువజన సంఘాలకు చేరాల్సిన నిధులను ఇష్టారాజ్యంగా ఖర్చు పెడుతున్నారనే విమర్శలున్నాయి. జిల్లా అధికారులు నెహ్రూ యువ కేంద్రంపై దృష్టి సారించి ఎన్‌వైకేకు గత వైభవం తీసుకు రావాలని యువజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

అందరినీ భాగస్వాములు చేయాలి

- సత్తినేని శ్రీనివాస్, రాష్ట్ర యువజన అవార్డు గ్రహీత



యువజన, మహిళా సంఘాలను, అవార్డు గ్రహీతలను ఎన్‌వైకే కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలి. ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకలను గ్రామీణ ప్రాంతలకు చేరవేసేందుకు అందరి భాగస్వామ్యం అవసరం.

యువజన సంఘాలను పట్టించుకోవడం లేదు

- మెతుకు హేమలత, హేమలత ఫౌండేషన్ అధ్యక్షురాలు



రిజిస్టర్ చేసుకొన్న సంఘాలకు సరైన గుర్తింపు ఇవ్వడం లేదు. నెహ్రూ యువ కేంద్రం ద్వారా చేపట్టే కార్యక్రమాలకు యువజన సంఘాలకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదు. గ్రామాల్లో యువజన కార్యక్రమాలను ప్రోత్సహం కరువైంది. ప్రత్యేకంగా మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించాలి..

- కొండ రవి, జాతీయ యువజన అవార్డ్ గ్రహీత



గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించాల్సిన కార్యక్రమాలను జిల్లా కేంద్రంలోని ప్రైవేటు విద్యా సంస్థల్లో నిర్వహిస్తున్నారు. కార్యక్రమాలను గ్రామీణ ప్రాంతాల్లోనే నిర్వహించాలి. ప్రతి కార్యక్రమంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డు గ్రహీతలను భాగస్వాములను చేయాలి.

కలెక్టర్ చొరవ చూపాలి

- అనభేరి నితీషారావు, యువ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్



నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో యువజన సంఘాల పాత్ర చాలా కీలకమైనదీ. యువజన సంఘాలను, యువజన అవార్డు గ్రహీతలను భాగస్వామ్యం చేసే విధంగా కలెక్టర్ చొరవ చూపి సమవేశాలు నిర్వహించి యువజన కార్యక్రమాలను ప్రోత్సహించాలి.

రాళ్లవాగు కుడి కాలువకు మహర్దశ కలిగేనా?

● నేడు ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల ఇరిగేషన్ ఈఎన్‌సీలతో ప్రభుత్వ విప్ సమీక్ష



రాళ్లవాగు కాలువలో అడ్డుగా ఉన్న పొదలు

కథలాపూర్, మే 18 (ఆంధ్రజ్యోతి) : రాళ్లవాగు ప్రాజెక్ట్ కుడి కాలువకు ఎప్పుడు మహర్దశ పడుతుందా అని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. సోమవారం ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ ఇరిగేషన్ ఈఎన్‌సీలతో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ కాలువను పరిశీలించి సమీక్ష చేయనున్నారు. ఈ ప్రాజెక్ట్ నిజామాబాద్‌జిల్లా కమ్మరిపల్లి మండలంలోని కోనాపూర్ అడవుల్లో 2005లో అప్పటి వైఎస్ఆర్ ప్రభుత్వం జలయజ్ఞంలో భాగంగా నిర్మించింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా దాదాపు 3 వేలఎకరాల బీడు భూమిని సాగులోకి తెచ్చేందుకు నిర్మాణం చేశారు. జగిత్యాల జిల్లాలోని భూషణరావుపేట, కథలాపూర్, పెగ్గెర్ల, ఊట్‌పల్లి గ్రామాల్లోని భూములను సస్యశ్యామలం చేయడానికి నిర్ణయం చేశారు. అయితే కుడి కాలువ తూము నుంచి వచ్చే నీటితో పాటు పైభాగం నుంచి వచ్చే వరద నీటి ప్రవాహం కారణంగా ఏటా నక్కల ఒర్రె ప్రాంతంలో తెగిపోతుంది. ఇరిగేషన్ అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేస్తున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. కాలువ తెగిపోయి చివరి భూములకు నీరందని పరిస్థితి ఎదురవుతోందని రైతులు వాపోతున్నారు. ఎడమ కాలువ ద్వారా 164 ఎకరాలు, కుడి కాలువ ద్వారా 2700 ఎకరాల మేర సాగు కావాల్సి ఉంది.

● రెండు జిల్లాల అధికారుల సమన్వయం కరువు

ఈ కాలువ అటు ఆర్మూర్, ఇటు రాజన్న సిరిసిల్ల జిల్లాల పరిధిలో ఉండడంతో తెగిపోయిన సందర్భంలో రెండు జిల్లాల అధికారులు మరమ్మతుల కోసం అంచనాలు వేయాల్సి ఉంటుంది. దీంతో కాలయాపన జరిగి కాలువ మరమ్మతులకు నోచుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఐదు నెలల క్రితం నక్కల ఒర్రె వద్ద పడ్డ గండిని పూడ్చడానికి కమ్మర్‌పల్లి ఇరిగేషన్ అధికారులు రూ.21 లక్షలతో కల్వర్టు నిర్మించారు. అయితే అదే ప్రాంతంలో మళ్లీ భారీ గండి పడి నీరంతా వృథాగా పోయింది. మళ్ళీ అంచనాలు వేయాలంటే రెండు ఉమ్మడి జిల్లాల అధికారులు సమన్వయం చేసుకోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. పలుమార్లు జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల పరిధిలోకి ప్రాజెక్ట్‌ను మార్చాలని రైతులు చేసిన విన్నపాలు పట్టించుకోవడం లేదు.

● సిమెంట్ లైనింగ్ వేయడమే శాశ్వత పరిష్కారం

తరచూ కాలువ తెగిపోతున్న క్రమంలో కాలువతో అవసరమున్న ప్రదేశాన్ని గుర్తించి శాశ్వతంగా సిమెంట్‌తో లైనింగ్ నిర్మాణం చేపడితేనే పరిష్కారం లభిస్తుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఐదు పిల్ల కాలువలకుగాను 2010లో రెండు మాత్రమే నిర్మించారు. అయితే కాలువల్లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించకపోవడం వల్ల ఆ పనులు అటకెక్కాయి. నష్టపరిహారం చెల్లింపుతో పాటు కాలువకు శాశ్వత పరిష్కారం చూపించాలని రైతులు కోరుతున్నారు.

అస్తవ్యస్తంగా వాహనాల పార్కింగ్

మల్యాల, మే 18 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో వాహనాలు పార్కింగ్ అస్తవ్యస్తంగా ఉందని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలకు తగినట్లు పార్కింగ్ ఏర్పాట్లు చేయకపోవడంతో ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గాలు ఇరువైపులా వాహనాలను నిలుపుతుండడంతో ట్రాఫిక్ జాం అయి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ఆదివారం ఉదయం వై జంక్షన్ ప్రాంతంలో మూడు మార్గాలకు అడ్డంగా వాహనాలు నిలిపి ఉంచడంతో వాహనాల రాకపోకలకు గంటల తరబడి భక్తులు అసౌకర్యానికి గురయ్యారు.



కొండగట్టు వై జంక్షన్ వద్ద రహదారులకు అడ్డంగా నిలిపిన వాహనాలు

ధాన్యం కుప్పను ఢీకొని ముగ్గురికి గాయాలు

వీణవంక, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్భాపూర్ గ్రామశివారులో ద్విచక్రవాహనం ధాన్యం కుప్పలను ఢీకొనగా ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్థుల వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా పరకాల నుంచి ద్విచక్రవాహనంపై వీణవంక మండలం కోర్కల్‌గ్రామానికి కంచె కిరణ్, కంచెపావని, కూమారుడు రాఘవతో కలిసి వెళ్తున్నారు. ఈ క్రమంలో వరిధాన్యం కుప్పలు ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు108కి సమాచారం అందించగా వరంగల్ అసుపత్రికి తరలించారు. రోడ్డుపై పోసిన ధాన్యం కుప్పలతో వారంలో ఇద్దరు మృతిచెందగా నలుగురికి తీవ్రగాయాలయ్యాయి.

పేకాటరాయుళ్ల అరెస్ట్

బీర్‌పూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓపాతఇంటిలో ఆరుగురు పేకాటరా యుళ్లను బీర్‌పూర్ ప్రొబేషనరీ ఎస్సై తన సిబ్బందితో దాడిచేసి పట్టుకున్నట్లు ఎస్సైతెలిపారు. వారి నుంచి 8,500రూపాయలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

గాజులపల్లిలో ఆరుగురు అరెస్టు..

మంథనిరూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులపల్లి గ్రామశివారులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను ఆదివారం పట్టుకున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. డబ్బులు పెట్టి మూడు కమ్మల పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బావిలో పడి రెండు గేదెలు మృతి

రాయికల్, మే 18 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని చెర్లకొండాపూర్ గ్రామంలో ప్రమాదవశాత్తు బావిలో పడి ఆదివారం రెండు గేదెలు మృతిచెందాయి. నానం సుమలత, ములాసపు మహేశ్వరీలకు చెందిన రెండు గేదెలు ఆదివారం మేత మేయటానికి గ్రామ శివారులోకి వెళ్లాయి. ఎండతీవ్రంగా ఉండటంతో సమీపంలోని బావి వద్దకు నీటిని తాగటానికి వెళ్లి అందులో పడి గేదెలు మృతిచెందాయి. గేదెల విలువ 80 వేల రూపాయల వరకు ఉంటుందని ప్రభుత్వం నష్టపరిహారం అందిచాలని బాధితులు కోరారు.

శిథిలావస్థలో ఎస్సారెస్పీ క్వార్టర్లు

- ప్రహరీ లేక ఆక్రమణలు
- దశాబ్దాల తరబడి నిరుపయోగం
- పట్టించుకోని పాలకులు



శిథిలావస్థకు చేరిన అధికారుల క్వార్టర్లు

సుల్తానాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణ నడిబొడ్డులో ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు చెందిన ఆస్తులు నిరుపయోగంగా ఉన్నాయి. దశాబ్దాల తరబడి వాటిని అలాగే వదిలేయడం మూలంగా అధికారులు, ఉద్యోగుల, సిబ్బంది నివాసగదులు క్వార్టర్లు పలు కార్యాలయాలు శిథిలావస్థకు చేరాయి. అక్కడక్కడ కూలిపోతున్నాయి. వీటిని ఎవరూ పట్టించుకోకపోవడంలేదు. వాటిని మరమ్మతులు చేయించడమో లేక కూల్చివేయమో చేసి భూములను కాపాడాల్సిన అవసరం ఉంది. లేదా శిథిలావస్థకు చేరిన క్వార్టర్లను బాగుచేసి ఇతర ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు ఇస్తే బావుండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులు, కుటుంబాలు ఇక్కడ నివాసముంటూ ప్రభుత్వ క్వార్టర్లను దర్జాగా ఉపయోగించుకున్నారు.ఎస్సారెస్పీ భూములకు రక్షణ లేకుండా పోయింది. ప్రహరీ లేకపోవడం మూలంగా చుట్టు పక్కల కొంతభూములు ఆక్రమించుకుని నిర్మాణాలు చేసినట్లుగా ఆరోపణలు ఉన్నాయి.

● కాలువల తవ్వకం కోసం క్యాంప్ ఏర్పాటు

సుల్తానాబాద్ ప్రాంతంలో శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు కాలువల నిర్మాణం పనులు ప్రారంభదశలో ఆ నిర్మాణాలు పర్యవేక్షించడం కోసం సుల్తానాబాద్ పట్టణంలోని నీరుకుళ్ల రోడ్డులో, డీ- 86 ప్రధాన కాలువకు సమీపంలో ఎస్సారెస్పీ ఇంజనీరింగ్ విభాగంతోపాటు పర్యవేక్షణ అధికారుల కోసం ఏకంగా ఇక్కడ ఒకక్యాంపును ఏర్పాటుచేశారు. ఈఈ మొదలుకొని పలువురు డీఈఈలు, ఏఈఈలు, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది కోసం 1978లో క్వార్టర్లు ఆఫీసులు నిర్మించారు. ఓ మాదిరి కాలనీయే ఇక్కడ నిర్మించారు. వాటర్‌ట్యాంకు, తద్వారా అన్ని ఆఫీసులకు, క్వార్టర్లకు పైప్‌లైన్లు వేసి నేరుగా నల్లాలద్వారా నీటి సరఫరా ఏర్పాటు చేశారు. కాలనీ నలువైపులా చక్కటి రోడ్లను తీర్చిదిద్దారు. అందమైన మొక్కలు నాటి చెట్లను పెంచారు. ఒకపుడు సుల్తానాబాద్ పట్టణానికే ఈ ఎస్సారెస్పీ క్యాంప్ కొత్త కళ, శోభను తెచ్చింది.మొదట్లో అధికారులు, ఉద్యోగులు సిబ్బంది అందరూ ఈక్వార్టర్లలోనే నివాసం ఉండేవారు. కానీ ప్రస్తుతం ఎవరూ ఇక్కడ ఉండడం లేదు. కరీంనగర్ తదితర పట్టణాల నుంచిరాకపోకలు సాగిస్తూ విధులకు హాజరవుతున్నారు. దాంతో రానురాను నిర్వహణ, పర్యవేక్షణలు కొరవడి ఈ క్యాంపును పట్టించుకోవడమే మానేశారు.

● కేవలం నాలుగు మాత్రమే వినియోగంలోకి..

విశాలమైన ఆవరణలో నిర్మించిన ఎస్సారెస్పీ క్యాంపు ప్రస్తుతం కళావిహీనంగా మారింది. డివిజన్ కార్యాలయం అంటే ఎవరూ నమ్మని తీరులో ఉంది. ఆఫీసు ముఖద్వారమే చెత్త చెదారంతో, శిథిలావస్థకు చేరిన క్వార్టర్లతో నిండి ఉంది. ప్రస్తుతం నాలుగు క్వార్టర్లను మాత్రమే వినియోగిస్తున్నారు. ఈఈ, డీఈఈ, రికార్డులతోపాటు మరో క్వార్టర్‌ను వినియోగిస్తున్నారు. అవి కూడా శిథిలావస్థకుచేరి ఉన్నవేకావడం గమనార్హం.. రాజుల సొమ్ములు రాళ్లపాలు అన్న చందంగా ప్రభుత్వ ఆస్తులు ఇలా నిరర్థకంగా పడి ఉండడాన్ని పలువురు గుర్తు చేసుకుంటూ ఆవేధన చెందుతున్నారు. భూముల ధరలు ఎక్కువగా ఉండడంతో ఈ భూములపై కన్నేసిన పలువురు వీటిని ఆ పేరుతో ఈ పేరుతో ఆక్రమించుకునే అవకాశాలు లేకపోలేదని పలువురు అంటున్నారు.

● ప్రహరీ నిర్మాణంతో ఆక్రమణలకు చెక్
- ఎస్సారెస్పీ ఈ ఈ ప్రసాద్

సుల్తానాబాద్ ఎస్సారెస్పీ క్యాంపు గురించి, ఇక్కడ నిరుపయోగంగా, శిథిలావస్థకు చేరి ఉన్న క్వార్టర్ల, ఆఫీసుల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాము. స్థలాన్ని అక్రమణకు గురికాకుండా చూడడానికి ముందు క్యాంపు చుట్టూ ప్రహరీని నిర్మించడానికి ప్రతిపాదనలు పంపించాము. ప్రహరీనిర్మాణం తర్వాత క్వార్టర్ల వినియోగం గురించి కూడా తగినచర్యలు తీసుకుంటాము. ఎవరు అక్రమణలకు పాల్పడ్డ చట్టరీత్యా చర్యలు తీసుకుంటాము. సుల్తానాబాద్ డివిజన్ పరిధిలోని పలుసబ్‌డివిజన్ కార్యాలయాలు కూడా తిరిగి యదాస్థానంలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.



కూలిపోతున్న క్వార్టర్లు

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

ముత్తారం మే 18 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ముత్తారం గ్రామ పంచాయతీకి చెందిన పింగిళిప్రమీల అనే వృద్ధురాలి మెడనుంచి గుర్తుతెలియని దొంగలు బంగారుగొలుసును అపహరించారు. ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధురాలిని శనివారం రాత్రి సమయంలో తలుపుతట్టడంతో వృద్ధురాలు తమబంధువులని తలుపుతీసింది. ఒక్కసారిగా మెడలో ఉన్న గొలుసులాక్కొని వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. వృద్ధురాలికి గాయాలుకాగా స్థానికులుపోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన వారు సంఘటన స్థలానికి చేరుకున్నారు. వృద్ధురాలు ఇచ్చిన ఫిర్యాదు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. త్వరలో దొంగలను పట్టుకొని కోర్టులో హాజరు పరుస్తామని ఎస్సై గోపతి నరేష్ తెలిపారు.

రేపటి నుంచి ఆర్జిత సేవలు రద్దు

మల్యాల, మే 18 (ఆంధ్రజ్యోతి): కొండగట్టులో మంగళవారం నుంచి గురువారం వరకు జయంతిఉత్సవాలు జరుగనుండగా ఆలయంలో ఆర్జితసేవలు నిలి పివేస్తున్నట్లు ఈవోశ్రీకాంత్‌రావు తెలిపారు. శుక్రవారం వరకు ఆర్జితసేవలు వాహనపూజలు, అభిషేకాలు, సత్యనారాయణవ్రతాలు ఉండవనిభక్తులు సహకరించాలని కోరారు. శనివారం నుంచి ఆర్జితసేవలు యథావిధిగా కొనసాగుతాయని ఈవో తెలిపారు.

కౌన్సెలింగ్‌తో వృద్ధుల కేసుల పరిష్కారం

జగిత్యాల అర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను పోషించక నిరాధరిస్తున్న కొడుకులకు,కోడళ్లకు జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ కౌన్సెలింగ్ఇచ్చారు. ఈ సందర్భంగా వారు తల్లిదండ్రులను పోషిస్తూ వారిబాగోగులు చూసుకుంటామని ఒప్పంద పత్రం రాసి ఇచ్చినట్లు హరి అశోక్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా హరిఅశోక్‌కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులను పోషించకుండా నిరాధరిస్తే రెవెన్యూడివిజనల్ అధికారి వయోవృద్ధుల ట్రిబ్యునల్ చైర్మన్ అరునెలలకు పైగా జైలుశిక్ష వేసే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రుల ఆస్తి రిజిస్ట్రేషన్ చేయించుకుంటే వాటిని తిరిగి స్వాధీనంచేసుకునే అవకాశం కలెక్టర్‌కు ఉందని ఆయన హెచ్చరించారు.

పోటెత్తిన భక్తజనం

- నాలుగో రోజు లక్షన్నర మంది పుణ్యస్నానాలు
- రద్దీగా మారిన రోడ్లు.. ఎట్టకేలకు వన్‌వే
- వారాంతపు సెలవుతో సందడిగా కాళేశ్వరం

కాళేశ్వరం, మే 18 (ఆంధ్రజ్యోతి): సరస్వతి నది పుష్కరాలకు ఆదివారం భక్తజనం పోటెత్తారు. పుష్కరతీరంతో పాటు కాళేశ్వరాలయం భక్తులతో కిటకిలాడాయి. వారాంతపు సెలవు కావడంతో కాళేశ్వరం పరిసరాలన్నీ ఆదివారం సందడిగా మారాయి. ఆదివారం మెయిన్ పుష్కరఘాట్‌లో సుమారు లక్షన్నర మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు.

● బారులు తీరిన వాహనాలు

ఆర్టీసీతో పాటు ప్రైవేటు వాహనాలు భారీగా తరలిరావడంతో రహదారులు కిక్కిరిసి పోయాయి. 15కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. దికారులు భక్తుల రాకను అంచనా వేయడంలో విఫలమవుతుండడంతోనే ట్రాఫిక్ సమస్య ఏర్పడిందనే విమర్శలు వస్తున్నాయి. మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వరకు మొత్తం అటవీ ప్రాంతమవ్వడం.. అందులోనే 15 వరకు మూలమలుపులుండటంతో ట్రాఫిక్‌జాం అవుతోంది. దీంతొ అధికారులు వన్‌వేను ప్రారంభించారు. పుష్కరస్నానాలు పూర్తిచేసుకున్న వాహనాలను అన్నారం, దామెరకుంట, గంగారం గ్రామాల మీదుగా పంపిస్తున్నారు. రద్దీ తగ్గితే మళ్లీ పాత మార్గంలోనే వాహనాలకు అనుమతిస్తున్నారు.

● ప్రముఖుల దర్శనాలు

సరస్వతీ పుష్కరాల్లో భాగంగా పలువురు ప్రముఖులు పుష్కరస్నానం ఆచరించారు. పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్దండ విద్యాశంకర భారతీ మహస్వామీతో పాటు సినీ నటుడు రాజేంద్ర ప్రసాద్, హైకోర్టు జడ్జి సుధా దంపతులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పుష్కర స్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయంలో కాళేశ్వర ముక్తీశ్వర స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



సినీ నటుడు రాజేంద్రప్రసాద్‌తో భక్తులు



కాళేశ్వరం ఆలయం వద్ద భక్తుల రద్దీ

● సాఫీగా సాగిన దర్శనాలు..

మూడు రోజులుగా దర్శనాలకు సాదారణ భక్తులు ఇబ్బందులు పడగా ఆదివారం సర్దుకుంది. దేవాదాయ శాఖ అధికారులు దర్శనాలకు ప్రత్యేక చొరవ తీసుకోవడంతో దర్శనాలు సాఫీగా సాగాయి. క్యూలైన్ల వద్ద, ప్రధాన గోపురం వద్ద సిబ్బంది పర్యవేక్షించారు.

● ఆలయానికి వెళ్లేందుకు ఇబ్బందులు

పుష్కరాలకు వచ్చిన భక్తులకు దర్శన తిప్పలు తప్పడం లేదు. తాత్కాలిక ఆర్టీసీ బస్టాండు నుంచి పుష్కరఘాట్‌కు ఉచిత బస్సులు, ప్రైవేటు వాహనాలతో భక్తులకు వెళ్లేందుకు సదుపాయాలు కల్పించగా అక్కడి నుంచి ఆలయానికి వెళ్లేందుకు ఎలాంటి ఏర్పాట్లు లేవు. దీంతో భక్తులు ఇబ్బందిపడుతున్నారు.

● అందుబాటులోకి ఏరియల్ రైడ్..

సరస్వతి పుష్కరాల సందర్భంగా భక్తులు విహంగ వీక్షణం చేసేందుకు ఏరియల్ రైడ్ అందుబాటులోకి తెచ్చారు.



కాళేశ్వరంనకు వెళ్లేదారిలో బారులు తీరిన వాహనాలు

ఆదివారం నుంచి పుష్కరఘాట్ మార్గంలోని హెలిప్యాడ్ నుండి రైడ్స్‌ను ప్రారంభించారు. ఒక్కో భక్తుడు .4500 రూపాయలు చెల్లించి కాళేశ్వరాలయంతో పాటు త్రివేణి సంగమ పరిసరాలను జాయ్‌రైడ్స్‌లో చూపించనున్నారు. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోను ఈరైడ్స్‌కు టికెట్ బుక్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.





గోదావరికి హారతి ఇస్తున్న భక్తులు

జయంత్యుత్సవాలకు కొండగట్టు ముస్తాబు

మల్యాల, మే 18 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలకు కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం ముస్తాబు అవుతోంది. సోమవారం సాయంత్రం ఉత్సవాలకు ఆలయ అర్చకులు అంకురార్పణ కార్యక్రమాలు చేపట్టనుండగా మంగళవారం నుంచి స్వామి సన్నిధిలో హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల కోసం అంజన్న ఆలయంతో పాటు ఉప ఆలయాలకు రంగులు వేశారు. ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించే త్రయాహ్నిక త్రికుండాత్మక యజ్ఞంకు యాగశాలను సిద్ధం చేశారు. దిగువ కొండగట్టు, దొంగలమర్రి-జేఎన్‌టీయూ మార్గంలో, కొండపైన స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. ప్రతియేటా నిర్వహించే హనుమాన్ పెద్ద జయంతిని ఈసారి అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు రోజులపాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి లక్షలాదిగా అంజన్న దీక్షాపరులు, భక్తులు కొండగట్టుకు చేరుకోనున్నారు. ఆలయానికి లైటింగ్ పనులు జరుగుతున్నాయి.



లడ్డూలు తయారు చేస్తున్న సిబ్బంది



వైజంక్షన్ ప్రాంతం నుంచి ఏర్పాటు చేస్తున్న పందిళ్లు

● అధికారుల పర్యవేక్షణ

కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో జరిగే హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలకు గాను భక్తులకు ఇక్కట్లు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. కొండపైకి వచ్చే భక్తులు అసౌకర్యానికి గురి కాకుండా ఏర్పాట్లపై ఇప్పటికే ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్ జిల్లా స్థాయి అధికారులు, దేవస్థానం అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. వందలాది పోలీసులచే బందోబస్తుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

వందేళ్ల సంబరం..

- వృద్ధురాలికి నూరేళ్ల పుట్టిన రోజు
- కుటుంబ సభ్యుల అనుబంధాన్ని చాటిన వేడుక

గంభీరావుపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలకేంద్రంలో మెళ్ల రామవ్వ అనే వృద్ధురాలి 100వ పుట్టిన రోజు సంబరాలను కుటుంబసభ్యులు ఘనంగా నిర్వహించారు. రామవ్వకు ఆదివారంతో 100ఏళ్ల నిండాయి. మండల కేంద్రంలోని ముదిరాజ్ ఫంక్షన్ హాల్‌లో కుటుంబ సభ్యులు అందరూ ఒకచోట చేరి రామవ్వతో కేక్ కట్ చేయించారు. ఆటా పాటలతో సాగిన ఈ వేడుక కుటుంబ సభ్యుల అనుబంధాన్ని చాటి చెప్పింది. కార్యక్రమంలో రామవ్వ కుమారులు, కుమార్తెలు, కోడళ్లు, అల్లుళ్లు, మనవలు, మనవరాళ్లు, మునిమనవలు, మునిమనవరాళ్లు సమష్టిగా నిర్వహించారు. దాదాపు రామవ్వకు ముగ్గురు కొడుకులు, నలుగురు కూతుళ్లు కాగా, మొత్తం కుటుంబ సభ్యులు 70 మంది వరకు ఉన్నారు.



100 ఏళ్ల పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న రామవ్వ

కొండగట్టులో భక్తుల సందడి



కొండగట్టు ఆలయం ముందు భక్తులు

మల్యాల, మే 18 (ఆంధ్రజ్యోతి): సరస్వతీ నది పుష్కరాల నేపథ్యంలో కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో పుష్కర భక్తులతో కోలాహలం నెలకొంది. కాళేశ్వరంలోని సరస్వతీ నది పుణ్యస్నానాలకు వెళ్తున్న భక్తులు, తిరిగి వస్తున్న భక్తులు మార్గమధ్యంలోని కొండగట్టు అంజన్నను దర్శించు కుంటున్నారు. దీంతోరెండురోజులుగా కొండగట్టు భక్తులతో రద్దీగా మారింది.

గోపాలమిత్రల గోడు పట్టేదెవరికి?

- వేతనాలు అందక ఇబ్బందులు
- ఎనిమిది నెలలుగా పెండింగ్
- రాష్ట్రంలో 1,530 గోపాలమిత్రలు



జగిత్యాల జిల్లా గొల్లపల్లిలో పశువులకు టీకాలు ఇస్తున్న గోపాలమిత్రలు

జగిత్యాల, మే 18 (ఆంధ్రజ్యోతి): పశు సంవర్ధక శాఖలో పనిచేస్తున్న గోపాల మిత్రల గోడు పట్టించుకునే వారు లేకుండా పోయారు. పశు పోషకులకు సహాయ సహకారాలు అందించే ందుకు పశువైద్య శాలల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన గోపాల మిత్రలకు ఎనిమిది నెలలుగా వేతనాలు అందడం లేదు. వచ్చే అరకొర వేతనం సైతం సకాలంలో అందకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. కుటుంబ పోషణ భారంగా మారుతుండడంతో ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నారు.

● పశువైద్యంలో కీలకపాత్ర


పశు సంవర్ధక శాఖలో గోపాల మిత్రలు కీలకపాత్ర పోషిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1530 మంది గోపాల మిత్రలుండగా, జగిత్యాల జిల్లాలో 22 మంది పనిచేస్తున్నారు. పశువులకు కృతిమ గర్భధారణ చేయడంతో పాటు మేకలు, గొర్రెలకు ప్రాథమిక వైద్య అందిస్తుంటారు. అదే విధంగా పశువులకు వాక్సినేషన్లు వేయడంలో, కృతిమ గర్భధారణ లక్ష్యాలు నెరవేర్చడంలో గోపాలమిత్రలు కీలకంగా వ్యవహరిస్తుంటారు. పశువుల సంఖ్య మేరకు గోపాలమిత్రలకు కృతిమ గర్భధారణ టార్గెట్లు నిర్ణయిస్తున్నారు. ఒక్కో గోపాలమిత్రకు నెలకు వంద కృతిమ గర్భాధారణ చేయాల్సి ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులు సహజ గర్భధారణకు ప్రాధాన్యం ఇస్తుంటారు. దీంతో గోపాల మిత్రలు టార్గెట్లు పూర్తి చేయడంలో ఇక్కట్లు ఎదుర్కొం టున్నారు. కొన్ని సందర్భాల్లో టార్గెట్లు రీచ్ కాలేందటూ గౌరవ వేతనాల్లో కోత విధిస్తున్నారని గోపాలమిత్రలు వాపోతున్నారు. పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్య తీసుకవెళ్లినా ఫలితం ఉండడం లేదంటున్నారు.

● ఎనిమిది నెలలుగా వేతనాలు పెండింగ్

గోపాల మిత్రలకు ఒక్కొక్కరికి నెలకు రూ. 11,050 గౌరవ వేతనంగా ప్రభుత్వం చెల్లిస్తోంది. 2024 సెప్టెంబరు నుంచి 2025 ఏప్రిల్ వరకు ఎనిమిది నెలల గౌరవ వేతనం అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఎనిమిది నెలలకు పైగా చిల్లిగవ్వ చేతికి రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారి ఇబ్బందుల పాలవుతున్నారు. ఇచ్చే అరకొర వేతనాల్లో కోతలు విధిస్తుండడం, నెల నెలా చెల్లించకపోవడంతో అప్పు చేస్తూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

- వేములవాడ గంగారం, గోపాలమిత్ర సంఘం జిల్లా అధ్యక్షుడు, జగిత్యాల



పశు సంవర్ధక శాఖలో పనిచేస్తున్న గోపాలమిత్రలకు రావాల్సిన తొమ్మిది నెలల పెండింగ్ వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి. ఏ నెలకు ఆ నెల గౌరవ వేతనం అందేలా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలి. ఇచ్చే అరొకర వేతనాలు ఎప్పటికప్పుడు అందకపోవడంతో అవస్థల పాలవుతున్నాం.

ఇబ్బందులు పడుతున్నాం

-చెరుకు శ్రీనివాస్, గోపాలమిత్రల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు,



పశు సంవర్ధకశాఖలో పనిచేస్తున్న గోపాలమిత్రలకు సక్రమంగా వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నాం. మా కష్టానికి తగ్గట్టుగా వేతనాలు ప్రతినెలా చెల్లించాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి.

బడ్జెట్ విడుదల కావాల్సి ఉంది

- డాక్టర్ కె. వేణుగోపాల్, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి, జగిత్యాల



గోపాలమిత్రలకు అందించే గౌరవ వేతనాల బడ్జెట్ విడుదల కావాల్సి ఉంది. జిల్లాలో పనిచేస్తున్న గోపాలమిత్రల వివరాలను ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు పంపుతున్నాం. బడ్జెట్ కేటాయిస్తే వారి బ్యాంకు ఖాతాల్లో వేతనాలు జమ అవుతాయి.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

- దర్శనానికి రెండు గంటల సమయం
- రాజన్న సేవలో మహానాథ్ మహేంద్ర దాస్‌జీ

వేములవాడ కల్చరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు రాజన్న కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకుని ఆయాక్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్నారు. రాజన్నకు ఇష్టమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు సుమారుగా రెండు గంటలపాటు క్యూలైన్‌లో బారులుతీరి రాజన్నను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులకు తలెత్తకుండా ఆల యాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిం చారు.



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

రాజన్న సేవలో అయోధ్య లవకుశ జన్మభూమి తీర్థక్షేత్ర అధ్యక్షుడు..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని అయోధ్యలవకుశ జన్మభూమి తీర్థక్షేత్ర అధ్యక్షుడు మహానాథ్ మహేంద్రదాస్‌జీ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం అద్దాలమండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇచ్చారు. ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.



రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుంటున్న మహానాథ్ మహేంద్ర దాస్‌జీ

కంపోస్టు ఎరువు తయారీపై ప్రత్యేక దృష్టి

కోరుట్ల మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: మున్సిపాలిటీలో వ్యర్థాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

కమిషనర్: తడి, పొడి చెత్తను వేరు చేస్తూ పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో మిగిలిన వ్యర్థాలను సేకరించి కంపోస్టు షెడ్‌లో సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్నాం. అవసరం ఉన్న రైతులతో పాటు హరిత హారంలో నాటిన మొక్కల సంరక్షణకు ఎరువుగా వాడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: తాగునీరు సమస్య రాకుండా ఏంచర్యలు తీసుకుంటున్నారు?

కమిషనర్: మిషన్ భగరధ నీటిని ప్రస్తుతం సరఫరా చేస్తున్నాం. తాళ్ల చెరువు ప్రాంతంలోని ఫిల్టర్ బెడ్ పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసి నీటిని పట్టణ ప్రజలకు అందించేందుకు ప్రణాళిక రూపొందించుకున్నాం. తాగు నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతాం.

ఆంధ్రజ్యోతి: ప్లాస్టిక్ నియంత్రణకు ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు?

కమిషనర్: ప్లాస్టిక్ నియంతరణపై వార్డులలో ఉన్న వివిధ పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. పట్టణంలోని వివిధ ప్లాస్టిక్ ఏజెన్సీలు, హోటల్స్, రెస్టారెంట్, కిరాణం దుకాణాలలో దాడులు నిర్వహిస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ కవర్లు విక్రయించిన వారికి జరిమానాలు విధిస్తున్నాం.

-కోరుట్ల

బాధిత కుటుంబానికి పరామర్శ

మల్లాపూర్, మే18 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ మండల కేంద్రానికి చెందిన పోగుల నరేష్ అను యువకుడు బెహరాన్ దేశంలో ఇటివల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం బాధిత కుటుంబాన్ని కోరుట్ల నియోజక వర్గం తెలుగుదేశం ఇన్‌చార్జి మానుక ప్రవీణ్‌కమార్ పరామర్శించి నరేష్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో ఎండి సాదుల్లా, చిప్ప రాజశేఖర్, కటకం మహదేవ్, రాజేందర్, గంగులు, తదితరులు ఉన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీ అధ్యక్షుడిగా నరేష్

ధర్మపురి, మే 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండల ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడిగా వేముల నరేష్ ఎన్నికయ్యారు. స్థానిక ఆర్ఎంపీ, పీఎంపీ భవనంలో ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు ఆదివారం సమావేశం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా ఒడ్డేటి నరేష్, కోశాధికారిగా కడారి గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా కోశాధికారి చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

రెండు నెలలుగా తెరుచుకోని 'పీఎంఈజీపీ' సైట్

-మీ సేవా కేంద్రాల చుట్టూ నిరుద్యోగుల ప్రదక్షిణలు



గొల్లపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగులకు స్వయం ఉపాధిని ప్రోత్సహించడానికి, ఆదాయ అవకాశాలను సృష్టించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రైమ్ మినిస్టర్స్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాం (పీఎంఈజీపీ) పోర్టల్ రెండు నెలలుగా తెరచుకోవడం లేదు. దీంతో ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా ఉపాధి పొందుదామని ఎంతో ఆశతో ఎదురు చూస్తున్న నిరుద్యోగులు రెండు నెలలుగా మీ సేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న పట్టించుకునే నాథులు కరువయ్యారు. సాంకేతిక సమస్యల కారణంగా ఈ పోర్టల్ ఓపెన్ కాకపోవడంతో అటు ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతుండగా నిరుద్యోగులకు శాపంగా మారింది. ఈ ఆర్థిక సంవత్సరం ఆరంభం నుంచి ఆన్‌లైన్‌లో సైట్ ఓపెన్ కాక వందలాది మంది నిరుద్యోగుల దరఖాస్తులు మీ సేవా కేంద్రాల్లో ఓ మూలన పడిఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంఈజీపీ పథకం ద్వారా ఇప్పటికే వందలాది మంది నిరుద్యోగులు రాయితీ పై బ్యాంకు రుణాలను పొంది ఆర్థిక స్వాలంభన సాధించే దిశలో ఉన్నారు. ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకొని ఆర్థికంగా నిలబడాలనే సంకల్పంతో నిరుద్యోగులు, మహిళలు పీఎంఈజీపీ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. సైట్ ఓపెన్ కాకపోవడం వారి ఆశల మీద చన్నీళ్లు చల్లినట్ల యిందని నిరుద్యోగులు వాపోతున్నారు. పీఎంఈజీపీ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు నిరుద్యోగులు మీసేవా కేంద్రాల చుట్టూ నిత్యం బారులు దీరుతున్నారని, అయితే సైట్ ఓపెన్ కాకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారని నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన పోర్టల్‌ను పునరుద్ధరించాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

స్వయం ఉపాధి పొందాలనుకుంటున్నా..
-రంగ ప్రసన్న, జగిత్యాల



నేను గ్రాడ్యుయేషన్ పూర్తి చేశా. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంఈజీపీ పథకం ద్వారా స్వయం ఉపాధి పొందాలనుకుంటున్నా. గత ఏప్రిల్ నుంచి ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నా. ఎప్పుడు మీ సేవా కేంద్రానికి వెళ్లినా సైట్ ఓపెన్ కావడం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. దీంతో చేసేదేమి లేక నిరాశతో వెనుదిరుగుతున్నా. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియను తిరిగి పునరుద్ధరించాలి.

పోర్టల్ అప్‌డేట్ అవుతోంది..
-యాదగిరి, ఇండస్ట్రియల్ మేనేజర్

పీఎంఈజీపీ పోర్టల్ అప్‌డేట్ అవుతోంది. దీంతో కొంతకాలంగా ఓపెన్ కావడం లేదు. నిరుద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈ సమస్య దేశవ్యాప్తంగా నెలకొని ఉన్నది. అతి త్వరలోనే కొత్త పోర్టల్ అందుబాటులోకి రాను న్నది. నిరుద్యోగులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా నూతన పోర్టల్‌ను రూపొందిస్తున్నారు.

సత్యసాయి వలంటీర్ల సేవలు అభినందనీయం

-జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల అర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి వలంటీర్లు చేస్తున్న సేవలు అభినందనీయమని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారం కర్ణాటక రాష్ట్రంలోని ముద్దనహళ్ళిలోని సత్యసాయి వెల్‌నెస్ సెంటర్‌ను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో సత్యసాయి వాలంటీర్ల సేవలు అభినందనీయమన్నారు. జగిత్యాల పట్టణంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో చేస్తున్న సేవలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొనియాడారు. సిద్దిపేట దగ్గర కొండపాకలో చిన్నపిల్లలకు గుండె ఆపరేషన్‌లు చేయడం ఎంతో మందికి ప్రాణ దానం చేయడం జరిగిందన్నారు. తెలంగాణలో ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పోషకాలు అందించే క్రమంలో రాగి మాల్ట్ అందజేశామని ఈ సంవత్సరం కూడా జగిత్యాలలో అమలు చేయాలని కోరారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో సత్యసాయి చారిటీ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమం ఎమ్మెల్యే వెంట డాక్టర్ నాగరాజు, కనకదుర్గ, సంతోష్ రెడ్డి, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

-పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిఅశోక్ కుమార్



మాట్లాడుతున్న హరిఅశోక్ కుమార్

కోరుట్ల, మే 18 (ఆంధ్రజ్యోతి) : పెన్షనర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని టీ పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిఅశోక్ కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పెన్షనర్ల డివిజన్ కార్యాలయంలో కోరుట్ల అధ్యక్షుడు పబ్బా శివానందం ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించి మాట్లాడారు. రిటైర్మెంట్ పొందిన వారికి పది మాసాలు అయినా విరమణ ప్రయోజనాలు అందక ఆర్థికంగా పలు అవస్థలను మాజీ ఉద్యోగులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వారికి అందే ప్రయోజనాలను వెంటనే అందించాలని అన్నారు. ఆరోగ్య పరిరక్షణ కోసం కార్డులపై నగదు రహిత వైద్య సేవలు అందడం లేదన్నారు. పెండింగులో ఉన్న డీఏలతో పాటు పీఆర్సీ సత్వరమే మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీ పెన్షనర్ల సంఘ సభ్యులు యాకుబ్, గౌరిశెట్టి విశ్వనాథం, గంటేడి రాజ్‌మోహన్, చిలుక గంగారాం, రాజేశ్వర్, లక్ష్మీ నారాయణ, ఎండి సైఫొద్దీన్, రాజయ్యలు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళ తరలింపు

మల్యాల, మే 18(ఆంధ్రజ్యోతి): మల్యాల కొత్తపేట బస్‌షెల్టర్ వద్ద కొంత కాలంగా భిక్షాటన చేసుకుంటున్న మతిస్థిమితం లేని మహిళపై కొందరు తరచూ అసభ్యకరంగా ప్రవర్తిస్తుండడంతో పోలీసులు ఆమెను కొండగట్టుకు తరలించారు. సుమారు రెండు నెలల క్రితం ఇక్కడకు చేరుకున్న సదరు ఒంటరి మహిళపై కొందరు పలుమార్లు అఘాయిత్యంకు పాల్పడినట్లు తెలుస్తుండగా కొన్ని వీడియో దృశ్యాలు చర్చనీయాంశంగా మారాయి. దీంతో పలువురు పోలీసులకు సమాచారం అందించడంతో ఆదివారం ఆటోలో కొండగట్టు ప్రాంతంకు తరలించారు.

ఆర్థిక సహాయం

జగిత్యాల అర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండల కేంద్రానికి చెందిన నిరుపేద యువతి వివాహానికి జగిత్యాల పట్టణానికి చెందిన మార్కండేయ యువజన స్వచ్చంద సేవా సమితి ఆధ్వర్యంలో 15 వేలా ఆర్థిక సహాయం అందించారు. ఆర్థిక సహాయంతో పాటు పట్టణానికి చెందన గీతా సిల్క్‌హౌజ్ యజమాని తన తండ్రి కస్తూరి జగదీశ్వర్ జ్ఞాపకార్థం పెళ్ళి కూతురుకు పెళ్ళి పట్టు చీర అందించారు. వీరితో పాటు పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి కొత్త ప్రతాప్ సంధ్యారాణి దంపతులు పెళ్ళి కూతురుకు మట్టెలు, మంగళసూత్రంతో పాటు లాంచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కండేయ యువజన సేవా సమితి అధ్యక్షులు చిలుకమారి శ్రీనివాస్, ఆకుబత్తిని శ్రీనివాస్, కొక్కుల సుధర్శన్, పద్మశాలి సంఘం జగిత్యాల అధ్యక్షులు బోగ గంగాధర్, మల్యాల అధ్యక్షులు బోడ గోవర్ధన్ వడెపెల్లి రాజ నర్సయ్య, కోమాకుల సుదర్శన్, వేముల శంకర్ పాల్గొన్నారు.

ప్రపంచ మేధావి బాబాసాహెబ్ అంబేద్కర్
-జగిత్యాల డీఎస్పీ రఘుచందర్



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాల అగ్రికల్చర్, మే 18(ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు రాజ్యాంగ రచన ద్వారా అంబేద్కర్ ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందారని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని స్థానిక తహశీల్ చౌరస్తా వద్ద ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం-అంబేద్కర్ సంస్మరణ దినం కార్యక్రమం నిర్వహించగా డీఎస్పీ రఘుచందర్ ముఖ్య అతిథిగా హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ జీవితం ఆదర్శం, అనుసరణీయం అన్నారు. చదువు ద్వారా మాత్రమే సమాజంలో గుర్తింపు పొందగలమన్నారు. విద్యను నిర్లక్ష్యం చేస్తే అన్నీ కోల్పోతామన్నారు. ప్రతి ఒక్కరూ విద్య ఆవశ్యకతను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, ఆయా సంఘాల బాధ్యులు నల్ల శ్యాం, నారాయణ, చిత్తారి ప్రభాకర్, బత్తుల ప్రదీప్‌రావు, బొల్లె శేఖర్, కంటె అంజయ్య, గిద్దె శంకరయ్య, తో పాటు అంబేద్కర్ సంఘాల నాయకులు, అంబేద్కర్ వాదులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ మృతులకు కొవ్వొత్తుల నివాళి

జగిత్యాల అర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ఎయిడ్స్ వ్యాధితో మృతిచెందిన వారికి ఆదివారం జగిత్యాల పట్టణంలోని మోతె వాడ ప్రభుత్వ ఆసుపత్రిలో కొవ్వొత్తులతో ఘనంగా నివాళి అర్పించారు. వరల్డ్ క్యాండిల్ మెమోరియల్ డేను పురస్కరించుకుని జిల్లా జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి పట్ల గ్రామీణ ప్రాంతాల్లో మరింత అవగాహన అవసరమన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు బయపడకుండా వైద్యుల సూచనలను పాటిస్తూ క్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఏఆర్టీ సెంటర్ల ద్వారా చేపడుతున్న సేవలను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్టీ వైద్యాధికారి డాక్టర్ చింత శావణి, అనిల్, శరత్, సృజన్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

'రైతులకు అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు'

కొడిమ్యాల, మే 18(ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల, పూడూర్ గ్రామాల్లోని సింగిల్‌విండోల్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి పి.జ్యోతి తెలిపారు. ఆదివారం ఏవో కొడిమ్యాలలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని తిర్మలాపూర్ సింగిల్ విండోలో జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. జీలుగ 30 కిలోల బ్యాగ్ 4,275 రూపాయలు, జనుము 40 కిలోల ధర 5,020 రూపాయలు కాగా 50శాతం రాయితీపై ఇస్తామన్నారు. అవసరం ఉన్న రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు వివరాలతో సంబంధిత ఏఈవోల వద్ద పర్మిట్ పొందాలన్నారు. అనంతరం పర్మిట్‌లతో సంబంధిత సింగిల్ విండోలలో జనుము, జీలుగ విత్తనాలను తీసుకోవాలని రైతులను కోరారు.

●**పెగడపల్లి:** పెగడపల్లి మండలంలో రాయితీపై పంపిణీ చేసేందుకు గాను పచ్చి రొట్ట విత్తనాలు పంపిణీ కి సిద్దంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పెగడపల్లి, నంచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో జీలుగ విత్తనాలు సిద్దంగా ఉన్నాయన్నారు. అవసరమున్న రైతులు పట్టాదారు పాస్ బుక్, ఆధార్‌కార్డు వివరాలతో వ్యవసాయ విస్తీర్ణాధికారి వద్ద పర్మిట్ పొంది సంబందిత సొసైటీల వద్ద విత్తనాలు పొందాలని వ్యవసాయాధికారి శ్రీకాంత్ తెలిపారు.

●**మల్యాల:** రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి కె.చంద్రదీపక్ తెలిపారు. మల్యాల, పోతారం, నూకపల్లి, తక్కళ్లపల్లి వ్యవసాయ సహకార సంఘాలు, మల్యాలలో గల రెండు డీసీఎంఎస్, రైతు సేవా కేంద్రంలో జీలుగ విత్తనాలు ఉన్నాయని పేర్కొన్నారు. రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్, మొబైల్ నంబర్‌తో మల్యాల, మానాల, నూకపల్లి రైతువేదిక వద్ద ఏఈవోల నుంచి పర్మిట్లు పొందాలని ఏవో సూచించారు.

హిందూ ధర్మ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత
-హంపి పీఠాధిపతి విద్యారణ్యభారతి స్వామి



ప్రవచనం చేస్తున్న హంపి పీఠాధిపతి విద్యారణ్యభారతి స్వామి

ఇబ్రహీంపట్నం, మే 18(ఆంధ్రజ్యోతి): హింధూ ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని హంపి పీఠాధిపతి విద్యారణ్యభారతి స్వామి అన్నారు. అదివారం మండలంలోని వేములకుర్తి గ్రామంలోని పాలరేవు గోదావరి నది తిరం లోని వేములకుర్తి అలయకమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారాన్ని తిసుకోని అలయ గర్భగుడి ముందు నుతన మండపం,అలయం లో అన్నపూర్ణ దేవి మాత నుతన విగ్రహం,ఎకశిల ధ్వజస్తంబ పునః ప్రతిష్ట కార్యక్రమాలు జరగగా హంపి పిఠదిపతి విరుపాక్ష భారతి స్వామి పారంభించి భక్తులకు పలు ప్రవచానాలు భోదించారు. హిందూ ధర్మం పరిక్ష కోసం ప్రతి ఒక్కరు కృషిచేస్తు అలయాలు అభివృద్ధి చేసుకోవాలన్నారు. ప్రతి 12సంవత్సరాలకోసారి కుంబాభిషేకం చేసుకొని ఆలయాలు పరిరక్షించుకోవలన్నారు. అనంతరం ఆలయంలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు చౌట్‌పల్లి యజ్ఞ అర్చకులు కప్పగంతుల గంగప్రసాద్ దిక్షిత్, అలయ అర్చకులు మంత్రరాజం శ్రీనివాసచార్యులు, మంత్ర రాజం జానకి రామకృష్ణ చార్యులు, శివ కూమార్ శర్మ,శితి కంత శర్మ, రాజా గౌతమ్ శర్మ, గణేష్ శర్మ పాల్గొన్నారు.

22న పెద్దహనుమాన్ జయంతి ఉత్సవాలు

ధర్మపురి, మే 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి అనుబంధ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో మే 22 న పెద్దహనుమాన్ జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించడం కోసం తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. ఈ ఉత్సవాల సందర్భంగా ఈ నెల 21 నుండి 23 వరకు సుదూర ప్రాంతాలకు చెందిన వేలాది మంది హనుమాన్ భక్తులు క్షేత్రానికి చేరుకుని స్వామి వారలను దర్శనం చేసుకుంటారని ఆయన పేర్కొన్నారు. ఉత్సవాల కోసం వచ్చే భక్తుల వసతుల ఏర్పాట్లపై ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తల సూచన మేరకు నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆలయం పక్షాన భక్తుల సౌకర్యార్థం దేవాలయం లోపల, వెలువల, చలువ పందిర్లు, క్యూలైన్లు, మంచినీటి వసతి, ఇతరత్రా అన్ని అవసర సౌకర్యాలు కల్పించడం కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

●**కార్యక్రమాల వివరాలు**

శ్రీ పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ధర్మపురి శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో మే 22న ఉదయం 6-30 గంటలకు స్వామి వారలకు మన్యసూక్త అభిషేకం, షోడశోపచార పూజలు, నివేదన, నీరాజన మంత్ర పుష్పములు, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. కావున అధిక సంఖ్యలో భక్తులు ఉత్సవాల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



జగిత్యాలలో సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

జగిత్యాల అగ్రికల్చర్, మే 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని విద్యానగర్‌లో గల శ్రీ రాజరాజేశ్వర ఉన్నత పాఠశాల 1994-95 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని స్థానిక వశిష్ఠ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 30ఏళ్ల క్రితం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. సామాజిక కార్యక్రమాలు చేపట్టేందుకు ఆనాటి రాజరాజేశ్వర విద్యార్థులు ముందుకు రావాలని, అందుకోసం నిధిని ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీ రాజరాజేశ్వర పాఠశాల కరస్పాండెంట్ నెమురు గోమ్మల తిరుపతిరావు, ఉపాధ్యాయులు మండలోజు ఉదయ్‌భాస్కర్, శ్రీనివాసరావు, కొత్తూరి మహేష్ కుమార్, ఆర్ రామారావుతో పాటు పూర్వ విద్యార్థులు దావ సురేష్, పైడిపెల్లి వామన్‌రావు, రాజశేఖర్‌రెడ్డి, మధుసూధన్ రావు, నల్ల విజయ్, సూర్య, జ్యోష్ణ, శైలజ, గీత, మాధవి, లక్ష్మీ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

●**కొడిమ్యాల మండలంలో..**

కొడిమ్యాల, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెప్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-2004విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పాఠశాలలో జరిగింది. మండలంలోని నమిలికొండ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989-1990 సంవత్సరంలో 10 వ తరగతి చదివిన విద్యార్థుల సమ్మేళనం పాఠశాలలో ఘనంగా జరిగింది. విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. గురువులకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అప్పటి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

గాయత్రి బ్యాంకును ప్రారంభించిన ఎమ్మెల్యే

మల్యాల, మే 18(ఆంధ్రజ్యోతి): గాయత్రి కోపరేటివ్ అర్బన్ బ్యాంకు 64వ శాఖను మల్యాలలో ఆదివారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. కార్యక్రమంలో సీఈవో వనమాల శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్, చైర్మన్ ముస్యాల లక్ష్మన్‌రెడ్డి, మేనేజర్ అబ్దుల్ రహీం ప్రారంభించారు.

చిరుతల రామాయణం

కొడిమ్యాల, మే 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లగొండ గ్రామంలోని హన్మాన్ ఆలయం వద్ద లక్ష్మీనర్సింహస్వామి కళామండలి వారి ఆధ్వర్యంలో చిరుతల రామాయణం ఉచిత నాటక ప్రదర్శన వైభవంగా జరుగుతోంది. రెండు రోజులుగా నాటకాన్ని నల్లగొండ శ్రీలక్ష్మీనర్సింహ స్వామి కళామండలి కళాకారులు నాటకంలోని పాత్రలకు జీవం పోసినట్లు నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. మొదటి రోజు తాటకి రాక్షసిని శ్రీ రాముడు వధించడం, రెండవ రోజు సీతారాముల కల్యాణం సన్నివేశాలను పాత్రదారులు రక్తి కట్టించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న చిరుతల రామాయణం ఉచిత నాటకం ఆసక్తికరంగా నాటకం జరుగుతుంది. సోమవారం శ్రీరాముని పట్టాభిషేకంతో నాటకం ముగుస్తుందని కళా మండలి వారు తెలిపారు. అనంతరం గ్రామస్తులకు అదె గ్రామానికి చెందిన పెరుమాండ్ల శ్రీనివాస్ విద్యాసాగర్ అన్నదానం చేయనున్నట్లు కళామండలి వారు తెలిపారు.

'తాగునీటి సమస్య పరిష్కారానికి విప్ కృషి'



మాట్లాడుతున్న ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దినేష్

ధర్మపురి, మే 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో తాగు నీటి సమస్య పరిష్కారానికి విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కృషి చేస్తున్నట్లు టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్ అన్నారు. గతంలో తాగునీటి సరఫరా విషయంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ శాశ్వత పరిష్కారం చూపించలేదని ఆయన ఆరోపించారు. ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్‌తో కలిసి ఆదివారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం ధర్మపురి ప్రాంతానికి శాశ్వత మంచి నీటి పరిష్కారం కోసం మొదటి ప్రాధాన్యత ఇచ్చినట్లు ఆయన తెలిపారు. జిల్లా ఇరిగేషన్, గ్రిడ్ అధికారులతో మాట్లాడుతూ ఎప్పటికప్పుడు నీటి కొరత లేకుండా చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఎక్కడ అవసరం ఉంటే అక్కడ బోర్‌వెల్స్ వేయించి, అమృత్ జల్ పథకం కింద ధర్మపురి పట్టణంలో వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం చేపట్టినట్లు ఆయన తెలిపారు. నీటి సరఫరా చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసి ట్యాంకుల నిర్మాణ పనులు కూడ ప్రారంభించడం జరిగిందని ఆయన అన్నారు. పది ఏళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు ఏనాడు ధర్మపురి ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేదని ఆయన పేర్కొన్నారు. టీయుఎఫ్ఐడీసీ నిధుల ద్వారా పట్టణంలోని పలు వార్డుల్లో సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీలు, కరెంట్ స్తంభాలు వేయించారని ఆయన అన్నారు. కేవలం అభివృద్ధిని చూసి ఓర్వలేని ప్రతిపక్ష నాయకులు అడ్లూరి, కాంగ్రెస్ పార్టీ పైన ఇలాంటి ఆరోపణలు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అప్పం తిరుపతి, మైనార్టీ అధ్యక్షులు ఎండీ రఫియొద్దీన్ పాల్గొన్నారు.

'ఏక్తా యాత్రకు అధిక సంఖ్యలో తరలిరండి'

కథలాపూర్, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 22న కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖా మంత్రి బండి సంజయ్‌కుమార్ నేతృత్వంలో నిర్వహించనున్న ఏక్తా యాత్రకు అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలి రావాలని మండల బీజేపీ అధ్యక్షుడు మల్యాల మారుతి కోరారు. మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. ఈ యాత్ర వల్ల హిందువుల ఐక్యతకు దోహదం చేస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, కాశోజి ప్రతాప్, గాంధారి శ్రీనివాస్, కథలాపూర్ మహేశ్ ఉన్నారు.

యువతి వివాహానికి చేయూత

జగిత్యాల అగ్రికల్చర్, మే 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక భక్తమార్కండేయ యువజన స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో మల్యాలకు చెందిన రూపిని వివాహానికి చేయూత నందించారు. వ్యాపారవేత్త కొత్త ప్రతాప్-సంధ్యారాణి ఆర్థిక సహాయంతో అమ్మాయి వివాహానికి ముఖ్యవస్తువులైన బంగారు మంగళసూత్రం, వెండి మట్టెలు, పెళ్లిచీర, సేవా సమితి ద్వారా రూ.15వేల ఆర్థిక సాయం అందించారు. గీతాసిల్క్ హౌజ్ శశిధర్ ఆధ్వర్యంలో పెండ్లి పట్టుచీరెను అందించినట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘ అధ్యక్షుడు బోగ గంగాధర్, కోశాధికారి కొక్కుల ప్రభాకర్, బోడ గోవర్ధన్, వడ్డేపల్లి రాజనర్సయ్య, చిలుక మారి శ్రీనివాస్ తదితరులున్నారు.

బాసర ఆలయ అర్చకుడిపై దాడిని ఖండిస్తున్నాం

జగిత్యాల అగ్రికల్చర్, మే 18(ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలోని బాసర ఆలయ ప్రధాన అర్చకుడు బ్రహ్మశ్రీ సంజీవ్‌పై జరిగిన దాడిని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (టీబీఎస్ఎస్ఎస్) పక్షాన ఖండిస్తున్నామని సంఘ రాష్ట్ర కోశాధికారి డా.సముద్రాల విజయసారధి తెలిపారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక బ్రాహ్మణ సంఘ బాధ్యులతో కలిసి ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘ బాధ్యులు గోవర్ధనగిరి ధీరజ్ కృష్ణమాచారి, నమిలకొండ యశస్వీ భరద్వాజ్, జగిత్యాల బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు వేణుమాధవరావు, సిరిసిల్ల రాజేందర్ శర్మ తదితరులున్నారు.